


ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వల్లూరు



వైద్యం చేస్తున్న డాక్టర్ గిరీష్

ఉచిత ఆక్యుపంచర్ వైద్య శిబిరానికి విశేషణ స్పందన లభించిందని జిబి హెల్త్ వెల్నెస్ డాక్టర్ గిరీష్ దేవాపురం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వల్లూరు ఉన్నత పాఠశాలలో పేదలకు ఉచితంగా ఆక్యుపంచర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో నడుం నొప్పి, మెడ నొప్పి ,సయాటికా, మోకాలినొప్పి, నరాల బలహీనత వంటి వాటికి వైద్యం చేశారు. డాక్టర్ గ్రేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సి.వి సురేంద్ర ,అబ్దుల్లా ప్రోత్సాహంతో నిర్వ హించిన వైద్య శిబిరానికి విశేషణ స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


గ్రంథాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

ఈనెల 29న గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులకు సూచించారు. తెలుగు భాష ప్రాభవానికి చిహ్నమైన తొలి తెలుగు శాసనం ఎర్రగుంట్ల మండలం కల మల్లలో క్రీస్తుశకం 575వ సంవత్సరంలో రేనాటి చోళ రాజు ధనుంజయ వర్మ వేయించారని అక్కడ తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం ఎంతో ప్రతిష్టాత్మకమని తెలిపారు. కార్యక్రమానికి తెలుగు భాషా వికాస ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, ఇంటాక్, జిల్లా పౌర సంబంధాల శాఖలు సమన్వయం చేసుకొని విజయవంతం చేయడానికి కృషి చేయాలని తెలిపారు.కల్లమల గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలోని తెలుగు శిలాశాసనాల గురించి కలెక్టర్‌కు శాసన తాళపత్ర గ్రంథ లిపి నిపుణులు నాగ దాసరి మునికుమార్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి సుధాకర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మేరీ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, సహాధ్యక్షులు రవికుమార్, భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య, కలమల్ల ఎస్సై తిమోతి, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల లెక్చరర్ హజరతయ్య, ఇంటెక్ట్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, మునికుమార్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్ కుమార్, మూలే మల్లికార్జున రెడ్డి, స్వతంత్ర బాబు, ఆలయ ఈవో జగన్మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్

కొండాపురం : మండలంలోని పి. అనంతపురం, ఏటూరు గ్రామాల వద్దనున్న ఇసుక రీచ్‌లను కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పరిశీలించారు అక్రమ రవాణా జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, బ్రిడ్జి దగ్గర నుంచి 500 మీటర్ల పైన ఇసుక తవ్వకాలు చేపట్టాలని అక్కడి అధికారులకు సూచించారు. మిషనరీసహాయం లేకుండా మనుషులతోనే ట్రాక్టర్లకు లోడ్ చేయాలని, సచివాలయంలో ఇసుక బుక్ చేసుకోవాలని తెలిపారు ఆయన వెంట జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఎంపిడిఒ నాగప్రసాద్, తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి అధికారులు పాల్గొన్నారు

వాహనాలు స్వాధీనం...రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు లేని 86 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 8 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్థులు, అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి, అనుమానితుల సమాచారాన్ని డయల్ 100 ద్వారా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. **కడప సబ్ డివిజన్ పరిధిలో:** కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రముక్కపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి రికార్డులు లేని 21 మోటార్ సైకిళ్ళు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కడప టూ టౌన్ పరిధిలోని మాసాపేట, గౌస్ నగర్ లలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లకు ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. **ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలో:** ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృతా నగర్‌లో నిర్వహించిన నాకాబందీలో, రికార్డులు లేని 42 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, రెండు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. **మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో :** మైదుకూరు అర్బన్ పిఎస్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో రికార్డులు లేని 14 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. **జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో :** తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని టి.కోడూరు గ్రామంలో పలువురు ఫ్యాక్షనిస్టుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

పేలుడు ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్సియా ఫార్మాలో పేలుడు ఘటనలో చనిపోయిన కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుని, ఆ కుటుంబంలో ఉద్యోగం ఇచ్చి, పేలుడుకు కారణమైన ఫార్మా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్, జిల్లా కోశాధికారి బి.లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న ప్రమాదం జరిగితే మెరుగైన వైద్యం కోసం 22న విశాఖ తీసుకొచ్చారని తెలిపారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. టీవీలో చూసి తెలుసుకుని రావడం మరింత విచారకరమని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోనూ, జిల్లాలోను ఇండస్ట్రీలో కానీ, ఫార్మా కంపెనీలలో కానీ మౌలిక సౌకర్యాలు లేకపోయినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఫార్మా, పరిశ్రమలలో సేఫ్టీ పరికరాలు ఉండాల్సినటువంటి అవసరం ఉందని తెలిపారు. సరైన మౌలిక సౌకర్యాలు ఉన్నప్పుడు మాత్రమే పర్మిషన్ ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాటిని అధికారులు తుంగలో తొక్కడం దుర్మార్గమని తెలిపారు. సరైన సౌకర్యాలు లేకపోయినా అనుమతులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నామ్స్ ప్రకారం మౌలిక సౌకర్యాలు, నిబంధనలు పాటించని వాటిని రద్దు చేయాలని తెలిపారు. కనుక ప్రమాదంలో పేలుడు జరిగిన కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుని వాటికి బాధ్యులైన యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప


122 పరుగులు చేసిన తేజారెడ్డి

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ సౌత్ జోన్ అండర్ 23 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచులు హోరాహోరీగా సాగుతున్నాయి. వైఎస్ఆర్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో 4 వికెట్ల నష్టానికి 87 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 35.2 ఓవర్లలో 174 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. 23 (నాట్ అవుట్), ఫర్హాద్ కాద్రి 18 పరుగులు చేశారు. కర్నూలు తోటలోని షేక్ ఇస్మాయిల్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 13.2 ఓవర్లు బౌల్ చేసి అందులో 3 ఓవర్లు మేడిన్ వేసి 59 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీసుకోవడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మనోజ్ రాజు 86, షేక్ ఇస్మాయిల్ 51 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసిన సమయానికి 10.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. 5 వికెట్ల నష్టానికి 395 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 102.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 450 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని తేజా రెడ్డి 122 పరుగులు చేశాడు. నికిత్ గౌడ్ 93 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 64.5 ఓవర్లలో 245 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని విజయ్ రామిరెడ్డి 83 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించే ఐదు వికెట్లు తీసుకున్నాడు. డేనియల్ దాస్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్

హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాంజనేయ పురంలో ఉన్న పాఠశాలలో 40 సంవత్సరాల నుంచి విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్స్ సంస్థల జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్ ఖాన్, ప్రిన్సిపల్ ఎం.మసూద బేగం మాట్లాడుతూ 1984 నుంచి ఇప్పటివరకు తమ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు కలవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 70 మంది విద్యార్థులు, ప్రయివేటురంగంలో పనిచేస్తున్న 250 మంది బధిర విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, పూర్వపు ఉపాధ్యాయులు, హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం డాక్టర్ దౌలత్ ఖాన్, మసూద బేగంను సన్మానించారు. మెమోంటో ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డాక్టర్ పి. దౌలత్‌ఖాన్, మసూద బేగంను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

హృద్రోగులకు ఉచిత సేవలు
త్వరలో ఆధునిక ఎక్స్‌రే సేవలు
డిసిహెచ్‌ఎస్ కో-ఆర్డినేటర్ వై.హిమదేవి వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

కమ్యూనిటీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం రీస్ట్రక్చరింగ్ పాలసీ ద్వారా కార్డియాలజీ మొదలుకుని స్పెషలిస్టు వైద్యుల నియామకాలను చేసింది. గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదిస్తే రూ.45 వేలు విలువ కలిగిన త్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాం. దీని ద్వారా గుండెపోటు ప్రమాదం నుంచి బయట పడే అవకాశం ఉంది. గుండెపోటు వైద్యంతోపాటు ఇతర వైద్య సేవల్లో డయాగ్నోసిస్‌కు సంబంధించిన ఎంఆర్ఐ, సిటి, టిఫాస్కాన్, ఆల్ట్రాసౌండ్ సహా అత్యాధునిక లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలను అందుబాటులోకి తెచ్చాం. గైనిక్, యండి, సర్జరీ, పీడియాట్రిక్, కార్డియాలజీ, హౌస్ సర్జన్ తదితర నిష్ణాతులైన వైద్యులతో సేవలను మెరుగు పరుస్తున్నామని పేర్కొంటున్న సందర్భంగా డిసిహెచ్‌ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వై.హిమదే వితో ముఖాముఖి...

మెరుగైన వైద్యసేవలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

సిహెచ్‌సిల పనితీరుపై సీరియస్‌గా దృష్టి సారించాం. ఫలితంగా రాష్ట్ర ఉన్నతాధికారులు జులైలో ఇచ్చిన ర్యాంకింగ్‌లో ఎగ్రేడ్‌తో ముందంజలో ఉన్నాం. అన్ని కేటగిరీల్లో ఉత్తమ పనితీరును కనరచడం సంతోషంగా ఉంది. కోవిడ్ అనంతరం వైద్యఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు, ప్రజల్లోనూ అవగాహన పెరిగిందని చెప్పవచ్చు.

గుండెవ్యాధుల నివారణ చర్యలేమిటి?

ఎమర్జెన్సీ మెడికల్ కేర్ ప్రోగ్రామ్ కింద గుండెపోటును గుర్తించిన రోగులకు గంటలోపు త్రాంబోలైసిస్ ఇంజెక్షన్‌ను ఇస్తాం. ఇప్పటి వరకు 60 త్రాంబోలైసిస్ ఇంజెక్షన్లు ఇవ్వడమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన గ్రామీణులు గుండెపోటు లక్షణాలను గుర్తించిన వెంటనే సిహెచ్‌సిలను సంప్రదించాలి. జిల్లా కేంద్రంలోని నిష్ణాతులైన వైద్యుల సహకారంతో సేవలు అందిస్తాం. వైద్యనిపుణుల సూచనల సహాయంతో రూ.45 వేల విలువ కలిగిన టెన్క్‌టిపైప్లేస్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

కార్డియాలజీ పరికరాల ఏర్పాటుపై మీరేమంటారు?

జిల్లాలోని తొమ్మిది సిహెచ్‌సిల్లో ట్వెల్వ్‌లీడ్ ఇసిజిలు, డీఫిబ్రి లేటర్స్, సంబంధిత ఇంజెక్షన్లు, మందులను అందుబాటులోకి ఉంచాం. ఇందుకుగానూ జిల్లాకు 16 సెల్‌ఫోన్స్ పంపిణీ చేశామని తెలిపారు. హృద్రోగ లక్షణాల బారిన పడిన రోగులు కలిగిన సిహెచ్‌సిల నుంచి కార్డియాలజీ వైద్యనిపుణుల సెల్‌ఫోన్స్‌కు మోగుతూనే ఉంటుంది. ఈమేరకు వైద్య సిబ్బ ందికి మూడు విడతలుగా శిక్షణను సైతం పూర్తి చేశాం.

సిహెచ్‌సి ఆస్పత్రులు ఎన్ని?

ఉమ్మడి జిల్లా పరిధిలో ఏడు సిహెచ్‌సి ఆస్పత్రులున్నాయి. వీటితోపాటు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. ఇందులో సుమారు 24 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచడమైంది.

ఓపి సేవల వివరాలు తెలపండి?

జిల్లాలోని తొమ్మిది సిహెచ్‌సి ఆస్పత్రుల్లో నెల వారీగా 1,15,345 ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలు అందుతున్నాయి. 94 శాతం సేవల్లో పెరుగుదల కనిపిస్తోంది. వీటితోపాటు సుమారు 24 రకాల ల్యాబ్, ఎక్స్‌రే సేవలు అందుబాటులో ఉంచడమైంది.

ఐపి సేవల గురించి చెప్పండి?

డిసిహెచ్‌ఎస్ పరిధిలో జనవరిలో 1,1661 ఇన్‌పేషెంట్ రోగులున్నారు. గతంలో 93 శాతం ఆపరేషన్స్ పెరగడం గమనార్హం. ఇందులో ఆపరేషన్స్, ఎఫిఎస్ డెలివరీస్, లాబ్‌టెస్ట్‌ల సంఖ్య అమాంతంగా పెరిగింది.

అత్యాధునిక వైద్యసేవలను వివరించండి?

హైరిస్క్ గర్భిణులు, అనీమియా రోగులకు సెకెండరీ హెల్త్‌కేర్ హస్పిటల్స్‌లో ఆదునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడమైంది. అనీ మియా రోగులకు ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్స్, బ్లడ్‌ట్రాన్స్‌ఫర్మేషన్ సదుపాయాలున్నాయి. సిజేరియన్ ఆపరేషన్స్, డెలివరీస్ నిర్వహణకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, లూనార్ ఆపరేషన్ థియేటర్ వంటి అత్యా దునిక సదుపాయాలున్నాయి. వీటిసహాయంతో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాం.

గర్భిణులకు గల సదుపాయాలు ఏమిటి?

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రతినెలా గర్భిణులు హెల్త్ చెకప్‌నకు ఉచిత ప్రయాణ సేవలను అందుబాటులోకి తేవడమైంది. డెలివరీస్‌తో పాటు డేకేర్ ట్రీట్‌మెంట్ సదుపాయాన్ని అందుబాటులోకి ఉంచడమైంది. గర్భస్థ శిశు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడానికి టిఫా స్కాన్ నిర్వహణకు ఆరోగ్యశ్రీ సదుపాయం కలిగిన ప్రయివేటు స్కానింగ్ సెంటర్‌లో ఉచిత సేవలు పొందేందుకు చర్యలు తీసుకోవడమైంది.

టెలీ మెడిసిన్ సేవలు గురించి తెలపండి?

ప్రొద్దుటూరు సిహెచ్‌సి పరిధిలో టెలిమెడిసిన్ సేవలు అందిస్తున్నాం. గైనకాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, విభాగాల్లో టెలి మెడిసిన్ సదుపాయాలు ఉన్నాయి. రోజూ 500 నుంచి 700 మందికి టెలీసేవలను అందిస్తున్నాం.

డయాలసిస్ కేంద్రాల గురించి చెప్పండి?

జిల్లాలో ప్రొద్దుటూరు, పులివెందుల సిహెచ్‌సిల్లో డయాలసిస్ కేంద్రాలున్నాయి. తాజాగా బద్వేల్ సిహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పా టుకు ప్రతిపాదనలు పంపించాం. ఇన్‌స్టాల్ చేయడం జరిగింది. పిపిపి మోడ్‌లో ప్రయివేటు సంస్థకు నిర్వహణ బాధ్యతలను అప్పగించాల్సి ఉంది.

సామాజిక స్పృహకు నిలయం 'మాడభూషి'

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజిక దృక్పథంతో అనేక కవితా సంపుటాలను వెలువరించిన ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ కవిత్వం సామాజిక స్పృహకు నిలయమని ప్రముఖ కవి, విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 135వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'ఆచార్య మాడభూషి సంపత్కుమార్ జీవితం–సాహిత్యం' అనే అంశంపై కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రసంగించారు. సంపత్‌కుమార్ శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు చిత్తూరు జిల్లా దేవళంపేట, కమ్మపల్లె గ్రామంలో జన్మించారని తెలిపారు. ఆయన మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎంఎ తెలుగు చదివారని, 1986లో అక్కడే ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి పర్యవేక్షణలో 'ఎరుకల తమిళ బంధువాచకాలు– సామాజిక భాషాశాస్త్ర విశ్లేషణ' అనే అంశంపై ఎంఫిల్ డిగ్రీ పొందారని చెప్పారు. ఆచార్య చల్లా రాధాకృష్ణ శర్మ పర్యవేక్షణలో 'ఎరుకల భాషకు వర్ణనాత్మక వ్యాకరణం' రాసి మధురై కామరాజు విశ్వవిద్యాలయం నుంచి 1990లో డాక్టరేట్ పట్టా పొందారన్నారు. 2022 డిసెంబరు నుంచి నెల్లూరు జిల్లా వెంకటాచలంలో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రానికి సంచాలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఉద్యోగరీత్యా ఆచార్యులే అయినా సంపత్ కుమార్‌లో ఉన్న కవితా పిపాస అడుగంటిపోలేదని తెలిపారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణ హంస పురస్కారం, తమిళనాడు ప్రభుత్వం ఉత్తమ అనువాదక పురస్కారం తదితర పురస్కారాలెన్నో అందుకున్నారన్నారు. కార్యక్రమం ప్రారంభంలో వక్త కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డిని పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, ఆచార్య పి.రమాదేవి, కొండ్రెడ్డి నాగిరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, కొత్తపల్లె రామాంజనేయులు, డా.ఎస్.రాజగోపాలరెడ్డి, డా.చెన్నకేశవరెడ్డి, శివారెడ్డి, నాగబాబు, కరీముల్లా, సాయిబాబా, జానమద్ది విజయభాస్కర్, పల్లె విజయ్, సిబ్బంది సత్కరించారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

మత విద్వేష వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో ఆదివారం ఉదయం ముస్లిం సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇస్లాం మహాప్రవక్త హజరత్ మహమ్మద్ ముస్తఫా సొల్లలాహు అలైహి వ సల్లం వారి కీర్తి, ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ ఆర్‌ఎస్ఎస్ ప్రేరేపిత మహారాజ్ అనే వ్యక్తి మహారాష్ట్రలో చేసిన అనుచిత వ్యాఖ్యలు, వ్యతిరేక వ్యాఖ్యలు ఇస్లాం, ముస్లిం మతస్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆరోపిస్తూ కడప వన్ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ అల్మాస్‌పేట నుంచి చిలుకలుబావి , రెండో గాంధీ విగ్రహం సర్కిల్ మట్టి పెద్దపులి వీధి, మద్రాస్ రోడ్డు మీదుగా ఏడు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. అనంతరం స్థానిక ఏడు రోడ్ల జంక్షన్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు , తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఆరిఫ్, జెఎసి కన్వీనర్ బాబు, నజీర్ అహ్మద్, ఇతర ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాజ్ ను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వాలు తక్షణం స్పందించి వరుసగా ఇస్లాం గౌరవ ప్రవక్త పై చేస్తున్న ఉద్దేశపూర్వక విద్వేష వ్యాఖ్యలకు చరమగీతం పాడని పక్షంలో భారీ స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్రంలోని ఆర్‌ఎస్ఎస్ విభాగమైన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఇస్లాం మతాన్ని, ముస్లిములను లక్ష్యంగా చేసుకొని ఇలాంటి మతవిద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. చట్టం తన పని చేయకపోతే నిందితులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పదేళ్ల కాలం నుండి బిజెపి ప్రభుత్వం ముస్లిములకు వ్యతిరేకంగా అనేక దురాగతాలకు పాల్పడుతోందని, నల్ల చట్టాలు తీసుకువచ్చి హింసిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మత గురువులు మహమ్మద్ అలీ బాగ్దాది , అబ్దుల్ రెహమాన్, జాకీర్ మూలాన అబ్దుల్, అబ్దుల్ జబ్బర్ ,షామీర్ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'ను పక్కాగా అమలు చేయాలి

- వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేయాలని, లేనిపక్షంలో వైసిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని కడప జిల్లా వైసిపి అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలకు ప్రజలను నుంచి స్పందన శూన్యం అని ఎద్దేవా చేశారు. పదవులు లేకపోయినా పచ్చ కండువాలు వేసుకొని గ్రామ సభల్లో టిడిపి నాయకులు పెత్తనం చలాయిస్తున్నారని అన్నారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూ.13 వేల కోట్లు అప్పు చేశారు. ప్రతి మంగళవారమూ అప్పుల రోజుగా ప్రభుత్వం ముందుకు పోతుంది అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నేరవేర్చలేదు అని అన్నారు. ఖరీఫ్ సీజన్ అయిపోతున్నా ఇంతవరకు రైతు భరోసా ఇవ్వలేదని తెలిపారు. ఎందుకు చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకున్నమా అని ప్రజలు బాధ పడుతున్నారని వాపోయారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు మద్దతు పలికిన వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వచ్చిన గ్రామ సభకు కూడా ప్రజల నుంచి స్పందన లేదు అని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, సిహెచ్. వినోద్ కుమార్, కార్పొరేటర్ షఫీ, నాయకులు పాల్గొన్నారు.

వరి సాగు ముమ్మరం

- గతంతో పోలిస్తే తక్కువ
- పెరిగిన ఖర్చులే కారణమంటున్న రైతులు
- బెంగాల్ నుంచి వరి నాట్లు వేసేందుకు వచ్చిన కూలీలు

ప్రజాశక్తి - చాపాడు


విశ్వనాథపురం వద్ద వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట విస్తారంగా సాగు అవుతుంది. నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, చాపాడు దువ్వూరు, ఖాజీపేట, మఠం మండలాల్లో అధికంగా రైతులు వరి సాగు చేపడుతున్నారు. ఇప్పటికే 10 వేల ఎకరాల వరకు వరి పంట సాగు పూర్తయింది. వారం, పది రోజులలో 20 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఆగస్టు 3న కెసి కాలువకు నీరు విడుదల కావడంతో వరి సాగు కొనసాగుతోంది. నియోజకవర్గ పరిధిలోని చాపాడు మండలంలో కుందూనది, కెసి పరిధిలో 14 వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేపడుతున్నారు. మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు మండలాల పరిధిలో తెలుగు గంగ రిజర్వాయర్ కింద 20 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గతంతో పోలిస్తే వరి పంట సాగు తగ్గుముఖం పట్టింది. ఇందన ఖర్చులు పెరగడంతో వరి సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. విత్తన వడ్లకు రూ.2వేలు, ట్రిల్లర్, గేజీలు కొట్టినందుకు ఎకరాకు రూ.1600ల ప్రకారం 2 దఫాలు చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. నాటేందుకు రూ. 4500, నారు మోసేందుకు రూ. 800, కాడి ఎద్దులకు రూ.1500 ఇలా ఎకరాకు 12 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని వాపోతున్నారు. కూలీలకు డిమాండ్ పెరగడంతో బెంగాల్ ప్రాంతం నుండి పిలిపించుకుని వరినాట్లు వేస్తున్నారు.సుమారుగా 500 మందికి పైగా బెంగాలీ కూలీలు వలస వచ్చి వరినాట్లు వేస్తున్నారు. రూ. 4000 ఎకరాకు కూలీలకు తీసుకుంటూ వరినాట్లు వేస్తున్నారు. సెప్టెంబర్ రెండవ వారం వరకు వరి నాట్లు దాదాపుగా పూర్తి కావచ్చని రైతులు పేర్కొంటున్నారు. సాగు ఖర్చులు పెరగడంతో కౌలు రైతులు భూములు చేసుకునేందుకు ముందుకు రావడంలేదు. ఎకరాకు 12 బస్తాలు చెల్లిస్తున్న కౌలు, ఈ ఏడాది 6 బస్తాల వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు .కొంతమంది రైతులు భూములు ఇవ్వకుండా స్వతహాగా సాగు చేపడుతున్నారు .మొత్తానికి ఈ ఏడాది వరి పంట సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు.

తగ్గిన టమోటా ధరలు

జూన్, జులైలో బాక్స్ రూ.1,800 నుంచి రూ.2,000- ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు ఒక్కసారి భారీగా తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయల ఖర్చు చేసి టమాటా సాగు చేస్తే.. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గడం, అదే సమయంలో గిట్టుబాటు ధర లభించక వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటకు తెగుళ్లు ఆశించి, దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన కాస్తా పంట నాణ్యత లోపించడంతో తక్కువ ధరకే అమ్మాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో 25 కిలోలు (బాక్స్) టమాట రూ.1,800 నుంచి రూ.2,000 ఉండేది. ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 మాత్రమే ఉంది. టమోటా సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తోందని రైతులు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం ఇందులో సగం ఖర్చులే వచ్చేవి.. అప్పుడున్న ధరలే ప్రస్తుతం మార్కెట్‌లో కొనసాగుతున్నాయన్నారు. వాతావరణ పరిస్థితులన్నీ సహకరిస్తే ఎకరాకు 15 నుంచి 19 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కానీ.. ప్రస్తుతం వివిధ కారణాలతో 10 క్వింటాళ్లకు మించడం లేదంటున్నారు. టమోటా కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ.40 వరకు వ్యయమైతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ.10 ఇవ్వాల్సిన పరిస్థితి. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు రాఘవరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచాలని మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు. పట్టణంలోని మానవత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత విలువల గురించి విద్యార్థులకు చెప్పడానికి స్వచ్ఛందంగా వారానికి ఒక పాఠశాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మానవత స్వచ్ఛంద కార్యాలయాన్ని వైఎస్ జయమ్మ కాంప్లెక్స్‌లోకి మార్చి అందరికీ అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రాఘవరెడ్డి, రిటైర్డ్ డాక్టర్ రంగారెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఇఒ హరిశ్చంద్రరెడ్డి, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై సభ్యులు శ్రద్ధ పెట్టాలి

వేంపల్లె : సేవా కార్యక్రమాలపై మానవత సేవా సంస్థ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి సూచించారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం మానవత మాసాంతర సమావేశాన్ని మండల శాఖ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ్యత్వాలపై చర్చించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల 40 మందితో మానవత సభ్యత్వాలు నమోదు చేయించినట్లు చెప్పారు. వైద్యుడు అరుణ్‌కుమార్ 10 మందితో, శివ 10 మందితో సభ్యత్వాలు నమోదు చేయించారన్నారు. సభ్యత్వాలు చేయించేందుకు సమయం కేటాయించాలని సభ్యులను కోరారు. ఆపదలో ఉన్న వారిని గుర్తించి ఆదుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవత కన్వీనర్ రంగారెడ్డి, రీజినల్ చైర్మన్ బాలాజీ, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, డైరెక్టర్ కొప్పుల గంగయ్య, అడ్వైజర్ రంగయ్య, పలువురు సభ్యులు పాల్గొన్నారు.


చక్రపాణిరెడ్డికి సభ్యత్వాలు అందజేస్తున్న సభ్యులు

పుట్ ఓవర్ బ్రిడ్జి లేక ఇబ్బందులు

రైల్వేగోడ దూకుతున్న విద్యార్థులు, ప్రయాణికులు-విన్నవించినా స్పందించని అధికారులు



రైల్వే ప్రహరీ దూకుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ జంక్షన్‌గా మారిన తర్వాత చాలా మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, స్థానిక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని రాణివనం, ప్రకాష్ నగర్, వినాయక నగర్, అంబేద్కర్ నగర్ కాలనీల విద్యార్థులు ముద్దనూరు రోడ్డులోని ఉన్నత పాఠశాలకు, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి గతంలో ప్రహరీ లేనందున సులువుగా వెళ్లేవారు. ప్రస్తుతం రైల్వే అధికారులు రైలులో జరిగే దొంగతనాలను అరికట్టడం కోసం నూతనంగా ప్రహరీ నిర్మించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు రైలు దిగి బస్టాప్ వద్దకు వెళ్లాలన్నా.. బస్టాప్ నుంచి రైల్వేస్టేషన్ వెళ్లాలన్నా ప్రహరీ ఎక్కి దూకుతున్నారు. విద్యార్థులకు స్కూల్ వెళ్లేందుకు బస్సు ఎక్కి స్టాప్‌లో దిగినా కూడా అక్కడి నుంచి కొద్ది దూరం నడవాల్సి వస్తుందనే కారణంతో రైల్వే ట్రాక్ దాటి వెళ్లేవారు. రైల్వే అధికారులు ప్రహరీ నిర్మించి, ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని గతంలో పలుమార్లు రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం అందించినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు వీలైనంత త్వరగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు హామీలను అమలు చేయాలి

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెకు సతీష్‌రెడ్డి ఆదివారం విచ్చేయడంతో ఆయన ఇంటి వద్దకు వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సతీష్‌రెడ్డికి పదవి వచ్చినందుకు ఆయనను పూల మాలలతో సత్కరించారు. సతీష్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి హాజరయ్యారు. అనంతరం సతీష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు హామీలను నేరవేర్చకపోతే ప్రజల ముందు దోషిగా నిలబడతామన్నారు. ధన సంపాదనే ధ్యేయంగా టిడిపి నాయకులు రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గంలో ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన ఒక్క టిడిపి నాయకుడికి లేదన్నారు. వైఎస్ఆర్ పాలనలో నిలిచి పోయిన పనులను.. అప్పట్లో తాను టిడిపిలో ఉన్నానని, ఆ (టిడిపి) ప్రభుత్వంలో పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. అలాగే ప్రస్తుతం నిలిచిపోయిన రోడ్డు, డ్రెయినేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులు, ఇతర వాటిని కూడా పూర్తి చేసి మన్ననలు పొందాలని సూచించారు. అలా కాకుండా చౌకబారు రాజకీయాలు చేయడం సబబు కాదన్నారు. యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమంగా తోలుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు టిడిపికి అధికారం ఇచ్చింది సేవ చేయడానికని గుర్తుంచుకోవాలన్నారు. అలా కాకుండా దోచుకోవడానికి ప్రయత్నిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు టిడిపి నేతలకు బుద్ధి చెప్పడం ఖాయమని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలకు గొప్ప సేవ చేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ప్రజలు యూ టర్న్ తీసుకుంటున్నారని తెలిపారు. వైసిపి పాలనలో పులివెందులలో సిఎంగా జగన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టారని, ఆ పనులను కూడా పూర్తి చేయాల్సిన బాధ్యత పులివెందుల టిడిపి నేతలపై ఉందన్నారు. వైసిపిలో చేరిన అయిదు నెలల్లోనే తనపై నమ్మకంతో రాష్ట్ర పదవి ఇచ్చారని, ఆ పదవికి వన్నె తేవడం తన కర్తవ్యంగా భావిస్తున్నట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి వైసిపి బలోపేతానికి పని చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


జడ్‌పిటిసికి కేక్ తినిపిస్తున్న వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలు విజయవంతమయ్యాయి. అండర్-14,16 బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14 బాలబాలికలకు ట్రైయా తలాన్ ఏ, ట్రైయాతలాన్ బి, ట్రైయాతలాన్ సి, కిడ్స్ జావెలిన్.. అండర్-16 బాలబాలికలకు 60మీ, 600మీ, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో ప్రతిభ కనబరచిన మొదటి, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులను సెప్టెంబర్ 14,15,16 తేదీల్లో ఆచార్య నాగార్జున యూని వర్సిటీ గుంటూరులో జరుగే ఎపి స్టేట్ జూని యర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్ బాషా తెలిపారు. క్రీడల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు పి.వెంకట సుబ్బ య్య, సునీల్, శివారెడ్డి, ఎర్రన్న, రాఘవేంద్ర, అంకారావు, నాగేశ్వరరావు, రామచంద్రుడు, అనిల్, ఖాదర్‌రెడ్డి, దిలీప్, మురళి, నాగేశ్వరరావు, సీనియర్ క్రీడాకారులు రఫీ, రబ్బాని సహకరించారని, వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు


పైడిపాలెం రిజర్వాయర్‌కు చేరుతున్న కృష్ణా జలాలు

పైడిపాలెం రిజర్వాయర్‌కు పెరిగిన నీటి పంపింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌కు నీటి పంపింగ్‌ను అధికారులు పెంచారు. గండికోట రిజర్వాయర్ నుంచి ప్రారంభంలో 500 క్యూసెక్కులు మాత్రమే పైడిపాలెం రిజర్వాయర్‌కు నీటిని లిఫ్ట్ ద్వారా పంపింగ్ చేశారు. రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో త్వరగా నింపాలనే లక్ష్యంతో 6 పంపుల నుంచి 600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాసులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 6 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యాంలో3.2 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు. త్వరలో నీటి పంపింగ్ మరింత పెంచే అవకాశం ఉందని డిఇ పేర్కొన్నారు.

రవి కల్యాణ్‌కు 'గిడుగు' జాతీయ సాహితీ సేవా రంగ పురస్కారం

ప్రజాశక్తి - మైదుకూరు


రవి కల్యాణ్‌ను సన్మానిస్తున్న సుబ్బారెడ్డి

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీబాల శివయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, తెలుగు ఉపాధ్యాయుడు భూమిరెడ్డి రవికల్యాణ్ గిడుగు జాతీ య సాహిత్య సేవా రంగ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం ఆయనను అభి నందిస్తూ కొనియాడారు. అనంతరం రవికల్యాణ్‌ను ఘనంగా సన్మానించారు. సేవా రంగం, కళారంగం, జర్నలిజం తదితర రంగాల్లో ఆయన చేసిన కృషికి గిడుగు అవార్డు వరించడం అత్యంత సంతోషకరమని రెడ్యం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇంకెన్నెన్నో అవార్డులు అందుకోవాలని అత్యున్నత స్థాయికి ఎద గాలని రెడ్యం ఆకాంక్షించారు. అవార్డును గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29న విజయవాడలో రవికల్యాణ్ అందుకోనున్నారు.


అక్రమంగా నిర్మించిన గది

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు కూరగాలయల మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని వైసిపి నాయకులు కోరారు. కూరగాయల మార్కెట్‌లో నిబంధలను విరుద్ధంగా బండపై గది నిర్మించడం అక్రమమని ఆరోపించారు. బండపై కూరగాయలు వేసుకొని అమ్మకం కొనసాగించాలిగానీ, గదిని ఏర్పాటు చేసుకొని ఏకంగా వ్యాపారం చేయడం తగదన్నారు. అలాగే కూరగాయలను కిందవేసి అమ్మకం చేయరాదన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలతోపాటు పాదచారులు నడిచేచోటు కింద వేసి అమ్మకం చేసే విధానాన్ని అరికట్టాలని వారు కోరారు.

రోడ్లపై చెత్త కుప్పలు - పట్టని అధికారులు

- వాహనదారులు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రమైన వేములలో రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త కుప్పలను ప్రతి రోజూ అధికారులు దర్శించుకుంటున్నప్పటికీ వాటిని ఎత్తేయించడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేముల జడ్‌పి పాఠశాల వెనుక వైపు, వైద్యశాల వద్ద, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు ఉన్నాయి. రోడ్డుపైనే చెత్త ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన రోడ్డును డంపింగ్ యార్డుగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లన్నీ చెత్త కుప్పలుగా తయా రయ్యాయి. ఇంటింటికి రెండు చెత్త బుట్టలు ఇచ్చి తడి,పొడి చెత్త వేర్వేరుగా స్వచ్ఛ వాహనాలకు అందించాలని అవగాహన కల్పిస్తున్నా.. కొంత మంది బాధ్యతారాహిత్యంగా ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. చెత్త కుప్పలు పేరుకు పోతుం డడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాల యాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చెత్త కుప్పలు ఎక్కువగా ఉండడంతో రోగాల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన చెందు తున్నారు. బిసి కాలనీలో కూడా చెత్త కుప్పలు ఉన్నాయి. ఇప్పటికైనా అధి కారు లు స్పందించి రోడ్లపై ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

క్రైం కార్నర్

ఆరుగురు జూదరులు అరెస్టు

- రూ.32వేలు స్వాధీనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని కదిరి సమీపంలో జూదం ఆడుతున్న ఆరుమందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సిఐ జీవన్ గంగనాథ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిఐ తన సిబ్బందితో దాడి చేశారు. వీరివద్ద నుంచి రూ.32వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దొంగలను పట్టిచ్చిన రైతులు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని అమ్మగారిపల్లె గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన పైపులు చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని రైతులు పట్టుకున్నారు. వేంపల్లెలోని శ్రీరాంనగర్, రాజీవ్‌నగర్ కాలనీ, నందిమండలానికి చెందిన వ్యక్తులు అమ్మగారిపల్లె గ్రామ వ్యవసాయ పొలాల్లో శనివారం చోరీకి పాల్ప డ్డారు. విషయాన్ని తెలుసుకొన్న రైతులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను తెలుసు కోవడానికి గ్రామ సభలను నిర్వహిస్తోందన్నారు. ఆ సభల వల్ల అధికారులు ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి, ఎపిఎం

మహిళల జీవనోపాధి పెంపునకు కృషి

ప్రజాశక్తి - చక్రాయపేట

మహిళల జీవనోపాధి పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం డ్వాక్రా మహిళలతో లక్పతి దీదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులను లక్ పతి దీదీలుగా మార్చడానికి ప్రధాని నరేంద్ర మోడీ లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్వాక్రా మహిళల జీవనోపాదుల పెంపుదలకు పెద్ద ఎత్తున రుణాలను మంజూరు చేస్తాయి. తద్వారా పేదరిక నిర్మూలన వేగవంతం అవుతుందని సంకల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహేశ్వర్‌రెడ్డి గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు. డ్వాక్రా మహిళలకు లక్ పతి దీదీ ప్రశంసాపత్రాలను అందజేశారు. అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఎంతో క్రమశిక్షణతో తమ సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు రాజన్న, కరుణాకర్, నాగేశ్వరరావు, సుహాసిని, శివరాం, ప్రసాద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.


వేషధారణలో అలరించిన విద్యార్థులు

శ్రీ విద్యాధరి పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీవిద్యాధరి పాఠశాలలో ఆదివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి పండుగను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ప్రతిఒక్కరిని ఎంతగానో ఆకర్షించారు. చిన్నికృష్ణుని పాదముద్రలు వేయడం, ఉట్టికొట్టడం, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పలు పాటలకు చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి.నాగరాజు, సిఇఒ భానుప్రకాశ్, ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ప్రసాదాలు వితరణ చేశారు.



గుంతలమయంగా ఉన్న ఖాజీపేట-సుంకేసుల రోడ్డు

దెబ్బతిన్న రోడ్లు.. ప్రయాణానికి పాట్లు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట నుంచి సుంకేసుల వెళ్లే బైపాస్ దారి పెద్దపాటి గుంతలతో అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాహనదారులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతల వల్ల వాహనాలు దెబ్బతినడమే కాక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం దగ్గర దారి కావడంతో వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా, ఎలాంటి చర్యలు లేవని పలువురు పేర్కొం టున్నారు. దాదాపు నాలుగేళ్లుగా ఈ మార్గం మరమ్మతులకు నోచుకోలేదని వాహనదారులు వాపోపోతున్నారు. ఈ మార్గానికి వెళ్లే దారంతా పూర్తిగా దెబ్బతిందని, కొత్త రోడ్డు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజల కోరుచున్నారు.

విద్యుత్ తీగలు ఇలా.. ప్రమాదం జరిగితే ఎలా..



ప్రజాశక్తి-ఖాజీపేట : మండల వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు రోజు రోజుకూ అధికమవు తున్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి రెగ్యులర్ ఎఇ లేక పోవడంతో సమస్యలు పెద్దగా పరిష్కారానికి నోచుకోవడం లేదని రైతులు, విని యోగదారులు వాపోతున్నారు. విద్యుత్ నియంత్రికలు తక్కువ ఎత్తులో ఉం డడం, తీగలు కిందికి వేలాడడం వంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. రైతుల నుంచి విద్యుత్ సమస్యలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. నందిపాడు ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు రామాంజనేయులుకు చెందిన వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.